# అనగనగా ఒక కథ

జ్ఞిం

## గోడ మీద బొమ్మ

''ఎప్పుడో యాభై ఏళ్ల క్రితం జరిగిన సంఘటన ఇప్పుడు చెప్తున్నాను అనుకోకుండా వినరా.. సుబ్బూ..''

''ఏమిటి నాన్న వినేది? మీరీ ఇల్లు వదిలి రానంటారు అంతేకదా?''

''రానంటం లేదురా..ఈ ఇల్లు వదలాలో వద్దో నువ్వే చెప్పు-నేను ఈ ఇంటి కథని చెప్తాను''

సుబ్బూ అసహనంగా కూర్చున్నాడు- చెప్పు అన్నట్లు.

''ఒరేయ్ నువ్ వినవల్సిన మూడ్ అది కాదురా..మనిద్దరం ఓ చోట ఉంటే నాకు ఆనందం కాదూ? పైగా నీ స్వార్జితంతో మహేంద్రాహిల్స్‌లో కట్టుకున్న ఇంద్రభవనం లాంటి ఆ ఇంట్లో ఉండాలని నాకు మాత్రం ఉండదూ'' రిక్వెస్టింగ్‌గా కొడుకుతో అన్నాడు కమలాకర్.

''చెప్పండి నాన్నా..మీ నిశ్చితాభిప్రాయాలూ, మారని నిర్ణయాలూ కలబోసిన కథ'' అని సర్దుకున్నాడు సుబ్బు..అనే సుబ్రహ్మణ్యం.

☆ ☆ ☆

కమలాకర్ ఉంటూన్న ఇల్లు-తాతల నాటి ఆస్తి అనుకోట్లేదు. స్వార్జితం అంతకన్నా కాదు- అదో మహత్కార్యానికి వినియోగబడుతున్న దేవాలయం.

చెబితే వింతగా ఉంటుందేమోగానీ...ఆ ఇంట్లోకి అడుగుపెట్టగానే బొగ్గుతో వేసిన ఓ స్వామీజీ బొమ్మ గోడమీద కనిపిస్తుంది- ఆ బొమ్మకి కుంకం బొట్టు- బొమ్మకి మూడు అడుగుల కింద ఒక బల్ల- ఆ బల్ల మీద కొన్ని పూలూ, పూజాసామగ్రి- ఫ్రెష్‌గా వేసిన పూలూ...

గోడ మీద ఉన్న బొగ్గు బొమ్మ మాత్రం ఏభై ఏళ్ల క్రితం వేసినదే-

ఏమాత్రం వెలిసిపోనివ్వకుండా..అదే గీతల మీద బొమ్మని తీరుస్తున్నాడు...కమలాకర్-

ఆ బొమ్మలో స్వామీజీ...వాళ్ల ఇంటి ఇలవేల్పైన కారణం చాలా పెద్దది!

పదిహేనేళ్ల వయసులో కమలాకరానికి పెద్ద ప్రమాదమైన జబ్బే చేసి ఎవరెవరో డాక్టర్లొచ్చి ముదిరిపోయిన కామెర్ల జబ్బుని పెదవి విరిచేసారు.

ఆరుబైట మరణశయ్య పరచి పడుకోబెట్టేశారు. చావుబతుకుల మధ్య కొన్ని గంటలు..కొట్టుమిట్టాడుతుండగా కాశీ కావిడి వేసుకుని భిక్షాటన చేస్తున్న ఆ స్వామీజీ..ఆ వీధి నుంచి వెడుతూ ఆగాడు.

అసలే అంతకష్టంలో ఉన్న ఇంటికొచ్చి ముష్టి అడుగుతున్నందుకు అతన్ని అందరూ తిట్టిపోశారు.

స్వామీజీ ఆ అన్నపూర్ణ (కాశీ) కావిడిని కిందకి దింపి కమలాకర్ తల్లితండ్రుల్తో ఓదార్పుగా ''కంగారుపడకండి. పచ్చకామెర్లు ముదిరిపోయాయి. అయినా పరిస్థితి చెయ్యి దాటిపోలేదు! మీ అబ్బాయి ప్రాణానికి ఢోకా లేదు. ఒక్క క్షణం'' అంటూ ఎదురుగుండా తోటలోకి తుప్పల్లోకీ వెళ్లి కొన్ని ఆకులు, పచారీ దుకాణానికి వెళ్లి కొన్ని దినుసులూ తెచ్చి నూరి..వాటి రసాన్ని కమలాకర్ గొంతులోనూ..ముక్కులోనూ..పోశాడు. స్పృహ కోల్పోతూన్న కమలాకర్‌కి కాస్త వేడితగ్గి వళ్లు వెచ్చబడింది. జ్వరం తగ్గి చెమట్లు పోశాయి.

''లోపల పడుకోపెట్టండమ్మా. ప్రాణభయం లేదు'' అన్నాడు నాడి చూసి ఆ స్వామి.

అందరికీ అతని మీద గౌరవం కలుగుతోంది!

''రేపొచ్చి రెండో దఫా మందు ఇస్తాను'' అని వచ్చిన దారిని వెళ్లిపోయాడు.

అలా మూడు రోజులు ఆ స్వామీజీ రావటం మందులివ్వటంతో కమలాకర్ ఆరోగ్యం కుదుటపడింది.

ఆ మర్నాడు స్వామీజీ రాగానే కాళ్ల మీద పడ్డారు కమలాకర్ కుటుంబం.

జబ్బు పూర్తిగా తగ్గేదాకా మందులూ మాకులూ ఇచ్చి వెళ్లేవాడు.

పూర్తిగా కోలుకున్నాక కొత్తబట్టల్తో కొంత డబ్బుని ఇవ్వబో

**నా ప్రాణం నిలబెట్టిన ఆ స్వామీజీ రుణం తీర్చుకొంటూ కొన్ని వేలమందికి ప్రాణాలు నిలబెట్టగలిగాను. మీ తాతగారు ఇచ్చిన పొలం, ఫలసాయం నిన్నూ నన్నూ పోషిస్తోంది. నా ప్రాణాలు నిలబడ్డానికి కారణం మాత్రం...నేను చేస్తున్న మూలికా వైద్యమేరా...**

తుంటే తిరస్కరించాడు స్వామీజీ.

అప్పుడే అడిగాడు కమలాకర్ ''ఇంత అద్భుతం చేసిన ఆ మందు..ఆ మూలికలు ఏంటో చెప్తారా'' అని!

స్వామీజీ ''ఉచితంగా రోగులకి ఈ మందు అందిస్తావా'' అని ప్రశ్నించాడు.

''జీవితాంతం'' అన్నాడు కమలాకర్.

కరుణాకర్‌కి స్వామీజీ ఆ ఫార్ములా అంతా చెప్పాడు.

''ఇంకా ఏమైనా రోగాలు నయం చేయడానికి ఆకు మందులు చెప్తారా?'' ఆశగా అడిగాడు కమలాకర్.

''నేను డాక్టర్‌ని కాను నాయనా- నాకు ఈ జబ్బు చేసినప్పుడు నాకూ ఓ గురువు చెప్పిన వైద్యం ఇది! ఇదే నీకూ వినియోగించాను అంతే'' అన్నాడా స్వామీజీ.

వెళ్తూ వెళ్తూ..''ఉచితంగానే..సేవగానే ఈ ఇంట్లోనే రోగులని సేవించు'' అన్నాడు.



☆ ☆ ☆

''అదిరా కథ! తాతలనాటి నుంచీ సంక్రమించిన ఈ ఆస్తికి పైన నేనొక్క పైసా కూడా సంపాదించలేదు- కానీ నా ప్రాణం నిలబెట్టిన ఆ స్వామీజీ రుణం తీర్చుకొంటూ కొన్ని వేలమందికి ప్రాణాలు నిలబెట్టగలిగాను. మీ తాతగారు ఇచ్చిన పొలం, ఫలసాయం నిన్నూ నన్నూ పోషిస్తోంది. నా ప్రాణాలు నిలబడ్డానికి కారణం మాత్రం...నేను చేస్తున్న మూలికా వైద్యమేరా...ఇది మానేసి వచ్చెయ్యమంటావా చెప్పు సుబ్బూ'' అన్నాడు కొడుకుతో కమలాకర్.

చివరి మాటలు విని కొడుకు కళ్లు చెమ్మగిల్లాయి.

''నాన్నా! ఈ స్వామీజీ ఇచ్చినది కేవలం మీ ప్రాణమే కాదు మనకి తర తరాల కీర్తి- మీ చేత్తో మందు తీసుకుని బాగుపడ్డవాళ్లందరూ మిమ్మల్ని ఎంత పొగుడుతున్నారో కూడా నాకు తెలుసు- నేను ఇప్పుడో నిర్ణయం తీసుకుంటున్నాను- మీకు ఓపికున్నన్నాళ్లూ మీరీ పని చేస్తారు- ఆ తర్వాత నేను నా ఉద్యోగాలూ సంపాదనలూ ఆపి..ఈ 'గోడమీద బొమ్మ'కి శిష్యుణ్నవుతాను. మీ వారసత్వాన్ని నిలబెడతాను'' అన్నాడు సుబ్బు.

కొడుకు నిర్ణయాన్ని విని ఉబ్బితబ్బిబ్బై అతన్ని కౌగలించుకుని..కన్నీళ్లు కురిపించాడు.

''ఇదిరా తండ్రికి ఉత్తమ గతులు కలిగించే పని. ఈ మాటొక్కటే తీర్చుకుంటే చాల్రా..అప్పుడు చదివే మంత్రాలకన్నా ఆత్మ శాంతినిస్తాయి'' అన్నాడు కరుణాకర్!

ఆ తండ్రీ కొడుకుల్ని గోడమీద బొమ్మ ఆశీర్వదిస్తూనే ఉంది- ఉంటుంది!

☆